సాక్షి విశాఖపట్నం

శనివారం | 26 | అక్టోబర్ | 2024

న్యూస్‌రీల్

విక్టరీ ఎట్ సీ వద్ద రేపు లేజర్ షో



అలంకరణలో విక్టరీ ఎట్ సీ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ఆదివారం సాయంత్రం 7 గంటల నుంచి బీచ్ రోడ్డు వైఎంసీఏ సమీపాన 'విక్టరీ ఎట్ సీ' స్థూపంపై సౌండ్, లేజర్ షో నిర్వహించనున్నట్టు జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు శివప్రసాదరాజు తెలిపారు. లేజర్ షోలో 1971 నౌకాదళం యుద్ధం, విశాఖ నగర పాత్ర, యుద్ధ వీరుల సాహసాలతో పాటు దేశ చరిత్రను తెలిపే విధంగా అద్భుతమైన లేజర్ షో నిర్వహించనున్నామన్నారు. ఇకపై ప్రతి ఆదివారం లేజర్ షో నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి ప్రసూతి, స్త్రీ వ్యాధులపై అవగాహన సదస్సు

మహారాణిపేట: ఒబెస్ట్రెట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ (వోజీఎస్‌వీ) ఆధ్వర్యంలో ప్రసూతి, స్త్రీ వ్యాధులపై 58వ వార్షిక నిరంతరం వైద్య విద్యా కార్యక్రమం (సీఎంఈ) కార్యక్రమాన్ని శనివారం నుంచి రెండు రోజుల పాటు నగరంలో నిర్వహించనున్నారు. వైజాగ్ కన్వెన్షన్స్‌లో ప్రతిష్టాత్మక కార్యక్రమానికి సుమారు 500 మంది గైనకాలజిస్టులు హాజరుకానున్నారని వోజీఎస్‌వీ విశాఖ అధ్యక్షుడు డాక్టర్ వై.వి.నరసింహారావు, కార్యదర్శి డాక్టర్ కిరణ్మయి గొట్టపు చెప్పారు. ప్రసూతి, స్త్రీ వ్యాధులపై అవగాహన సదస్సు, ప్రసూతి శాస్త్రం, గైనకాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఫెడరేషన్ ఆఫ్ ఒబెస్ట్రెట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జయదీప్, మాజీ అధ్యక్షురాలు డాక్టర్ శశి ప్రభ, వైద్యులు కృష్ణమ్మ, సుబ్బరాజు, టి.రాధా, సీతా రామారాజు తదితరులు పాల్గొంటారన్నారు.


6 నుంచి రసజ్ఞ జాతీయ నాటకోత్సవాలు



నాటకోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, స్టార్‌మేకర్ సత్యానంద్ తదితరులు

మద్దిలపాలెం: కళాభారతి ఆడిటోరియంలో నవంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు రసజ్ఞ జాతీయ బహుభాషా నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రసజ్ఞ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఫెస్టివల్ డైరెక్టర్ డాక్టర్ వేమలి త్రినాథరావు తెలిపారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతికశాఖ సంయుక్త నిర్వహణలో ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఏయూలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో వీసీ ఆచార్య శశిభూషణ్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, స్టార్ మేకర్ లంకా సత్యానంద్ తదితరులు నాటకోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాలుగు నాటక సమాజాలు నైపుణ్యాలకు అద్దం పట్టే విధంగా ప్రదర్శనలు ఉంటాయని, ప్రవేశం ఉచితమని త్రినాథరావు వెల్లడించారు.

ఐఐఎం నూతన అధ్యక్షుడిగా స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాగ్చి



ఐఐఎం నూతన అధ్యక్షుడు బాగ్చీతో కార్యవర్గ సభ్యులు

ఉక్కునగరం: ది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ (ఐఐఎం) విశాఖ చాప్టర్ నూతన అధ్యక్షుడిగా స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అరుణ్ కాంతి బాగ్చి నియమితులయ్యారు. శుక్రవారం ఉక్కు పరిపాలన భవనంలో ఐఐఎం వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) నిర్వహించారు. కమిటీ కార్యదర్శి లలన్ కుమార్ గత ఏడాది ఐఐఎం నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఉపాధ్యక్షులుగా ఏయూ మెటలర్జీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు, రాష్ట్ర ఎన్ఐటీ మెటలర్జీ విభాగాధిపతి డాక్టర్ రఫీ మొహమ్మద్, కార్యదర్శిగా స్టీల్‌ప్లాంట్ ఆర్అండ్‌డి సెంటర్ డీజీఎం డాక్టర్ శివకుమార్ నియమితులయ్యారు. అదే విధంగా సంయుక్త కార్యదర్శులుగా క్యూఏటీడీ విభాగం డీజీఎం డీర్ సింగ్, ఆర్ఎండీ విభాగం డీజీఎం ఎస్.వి.సి.బోస్, కోశాధికారిగా కోక్ ఓవెన్స్ విభాగం డీజీఎం ఎస్. తాతారావు, సంయుక్త కార్యదర్శులుగా బి. నవీన్‌కుమార్, పి. రఘురామ్‌లతో పాటు తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.

నిబంధనలకు టెండర్



- కాంట్రాక్టర్ల చేతిలో అధికారులు కీలుబొమ్మలు
- చెప్పినట్టు నిబంధనలతో షార్ట్ టెండర్లు
- ఆన్‌లైన్ టెండర్ విధానం అభాసుపాలు
- జీవీఎంసీలో సింగిల్ టెండర్ వచ్చేలా నిబంధనలు
- సోలార్ లైట్లలో చక్రం తిప్పుతున్న 'చంద్ర'
- రెండోసారి టెండర్లతో నగం ధరకే బిడ్ దాఖలు
- విచారణ చేయకుండానే ఓకే చెప్పిన కూటమి ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో టెండర్ల వ్యవహారమంతా ఓ పెద్ద వండర్‌గా మారిపోయింది. నిబంధనలకు నీళ్లొదులుతూ... ఇష్టారాజ్యంగా నిబంధనలను రూపొందిస్తున్నారు. కాంట్రాక్టర్ల చేతిలో కీలుబొమ్మలుగా మారిన కొందరు అధికారులు.. వారు చెప్పినట్టుగానే నిబంధనలు రూపొందించి టెండర్లను ఆహ్వానిస్తున్నారు. దీంతో ఆన్‌లైన్ టెండర్ల వ్యవహారం అభాసుపాలవుతోంది. గుట్టుచప్పుడు కాకుండా మూడు రోజుల్లోనే టెండరు గడువును ముగించడం పరిపాటిగా మారిపోయింది. అత్యవసర పనులు మినహా మిగిలిన టెండర్ల కాల పరిమితిని కనీసం 15 రోజులుగా ఉంచాల్సి ఉంటుంది. ఇందుకు భిన్నంగా అధికార పార్టీకి చెందిన ట్రిపుల్ 'ఎస్' నేతలు నేరుగా అధికారులపై ఒత్తిడి తెచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు టెండర్లు పిలిచిన తర్వాత కేవలం ఒక్కరికి మాత్రమే అర్హత దక్కేలా నిబంధనలు విధించి అధిక ధరకు టెండర్ దక్కేలా చూస్తున్నారు. ఒకవేళ టెండర్ నిబంధనలను సవరించి ఎక్కువ సంఖ్యలో కాంట్రాక్టర్లు అర్హత సాధించేలా ఉంటే తక్కువ ధరకే బిడ్ దాఖలు చేసే అవకాశం ఉంటుంది. ఇందుకు భిన్నంగా జీవీఎంసీ అధికారులు కొందరు ఏకపక్షంగా కాంట్రాక్టర్ల కోసమే టెండర్లు అన్న విధంగా వ్యవహరిస్తున్నారు.

టెండర్ల పేరుతో ఏకపక్షం...!

ఏదైనా పనిచేపట్టాలంటే ఆన్‌లైన్ టెండర్లను ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో పిలవడం పరిపాటి. మరీ అంత అత్యవసరమైన పని అయితే మినహా సాధారణంగా టెండర్లను దాఖలు చేసేందుకు 15 రోజుల గడువును విధిస్తారు. అయితే జీవీఎంసీలో మాత్రం కొన్ని టెండర్లను కేవలం మూడు రోజుల సమయం మాత్రమే ఇచ్చి గుట్టుచప్పుడు కాకుండా ముగించేస్తున్నారు. జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి యర్రిగెడ్డ వద్ద ఉన్న ఆర్ అండ్ డి యార్డు వరకు 7 నెలల పాటు వాటర్ డ్రెయిన్ నిర్వహణ , మరమ్మతు (ఓఅండ్ఎం) కోసం అక్టోబరు 7వ తేదీన టెండర్లను ఆహ్వానించారు. ఈ పని విలువ రూ.80.36 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. అయితే, టెండర్ గడువును మాత్రం మూడు రోజులకే అంటే 10వ తేదీకే ముగించారు. రూ. 80 లక్షలకు పైగా విలువైన పని అంతేకాకుండా రానున్న 7 నెలల పాటు నిర్వహించాల్సిన పనిని అత్యవసరం పేరుతో ఎందుకు మూడు రోజులకే టెండరును పిలవాల్సి వచ్చిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం అధికారితో సత్సంబంధాలు ఉన్న కాంట్రాక్టరు మాత్రమే పాల్గొనేలా నిబంధనలు విధించడంతో పాటు మూడు రోజుల గడువు మాత్రమే ఇచ్చి అదే కాంట్రాక్టరుకు పనులు దక్కేలా సదరు అధికారులు చక్రం తిప్పారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తాజాగా వాటర్ డ్రెయిన్ నిర్వహణ, మరమ్మతు టెండర్‌తో పాటు గతంలో బీచ్ రోడ్డులో సోలార్ లైట్ల నిర్వహణ కాంట్రాక్టు టెండర్లను గమనిస్తే అధికారులు ఎంతగా కాంట్రాక్టర్ల చేతిలోకి వెళ్లిపోయారనే విషయం స్పష్టంగా అర్థమవుతోంది.

50 శాతం అధిక ధరకు..

బీచ్ రోడ్డులో కోస్టల్ బ్యాటరీ నుంచి కురుపాం సర్కిల్ వరకూ సోలార్ స్ట్రీట్ లైట్ల నిర్వహణ, మరమ్మతు పనులకు గతంలో జీవీఎంసీ టెండర్లను ఆహ్వానించింది. అయితే కేవలం చంద్ర ఎలక్ట్రికల్స్ మాత్రమే అర్హత సాధించేలా అధికారులు నిబంధనలను రూపొందించారు. అనుకున్న విధంగానే కేవలం ఆ సంస్థ మాత్రమే బిడ్లను దాఖలు చేసింది. ఈ సంస్థకు టెండరును కట్టబెట్టే సమయంలో అప్పటి కమిషనర్ సాయికాంత్ వర్మకు వచ్చిన సమాచారంతో నిబంధనలను సరళతరం చేసి టెండర్లను తిరిగి ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు. ఫలితంగా అదే పనికి తిరిగి నిబంధనలు సడలించి టెండర్లను ఆహ్వానించారు.

విచిత్రంగా మొదటి టెండర్‌లో ఏడాదికి రూ.1.5 కోట్లకు నిర్వహణ, మరమ్మతులు చేపడతానన్న సదరు సంస్థ..పోటీ వచ్చే సరికి రూ.80 లక్షలకే టెండరును దాఖలు చేసి పనులు దక్కించుకుంది. అంటే పోటీ ఉండటంతో సుమారు సగం మొత్తానికే పనులు చేపట్టే వీలుందని తేలిపోయింది. అయితే సదరు కాంట్రాక్టు సంస్థపై విచారణ చేయాల్సిన జీవీఎంసీ అధికారులు.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ టెండరుకు ఓకే చేసి చంద్ర ఎలక్ట్రికల్స్‌కే పనులు దక్కేలా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. వాటర్ డ్రెయిన్ ఓ అండ్ ఎంతో పాటు ఈ సోలార్ ఎలక్ట్రికల్స్ వ్యవహారంలోనూ జీవీఎంసీలో చక్రం తిప్పుతున్న ముగ్గురు నేతల ప్రమేయం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చక్రం తిప్పుతున్న ట్రిపుల్ ఎస్...!

రానున్న కాలానికి కాబోయే మేయర్ ననుకుంటున్న ఒక నేతతో పాటు ఆయన అనుచరులు,కూటమి నేతలు ట్రిపుల్ ఎస్ పేరుతో జీవీఎంసీలో చక్రం తిప్పుతున్నారనే విమర్శలు ఇప్పటికే బాహాటంగానే వినిపిస్తున్నాయి. ఫలానా పని కావాలంటే వారి నుంచి అధికారులకు ఫోన్లు వెళ్లడం వారి ఆదేశాలకు అనుగుణంగా అధికారులు పనులు చేయడం పరిపాటిగా మారిపోయింది. ఏకంగా ఫలానా పని ఫలానా కాంట్రాక్టరుకే ఇవ్వాలని అధికారులను ఆదేశించే వరకూ వ్యవహారం వెళ్లిపోయిందని తెలుస్తోంది. ఫలానా కాంట్రాక్టర్లు తమకు కమీషన్ ఇవ్వలేదు కాబట్టి..వచ్చే సమావేశంలో వారి పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వబోమని కూడా సదరు నేతలు బాహాటంగా ముందుగానే చెబుతున్నారు. 'భారీగా దండుకోవాలని మాకు పై నుంచి సిగ్నల్ ఉంది. ఎవరు ఏం చేసినా మా మాటే సాగుతుంది' అని కూడా సదరు నేతలు ముగ్గురూ వ్యాఖ్యానిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

90 మిలియన్ టన్నుల సరకు రవాణా లక్ష్యం



బోర్డు రూంను ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు

విశాఖ సిటీ: విశాఖ పోర్టు ఈ ఏడాది 90 మిలియన్ టన్నుల సరకు రవాణా చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని దాని సాధన కోసం కృషి చేస్తున్నట్లు పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు తెలిపారు. విశాఖ పోర్టు అథారిటీ 91వ ఆవిర్భావ దినోత్సవాన్ని పోర్టు పరిపాలనా భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ప్రారంభించిన చైర్మన్ మాట్లాడుతూ పోర్టు గత ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణా చేసి నూతన రికార్డును నెలకొల్పిందని, దాన్ని అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు.

అలాగే పోర్టులో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పోర్టు సామర్థ్యం, పోర్టులో పర్యావరణ సుస్థిరత కోసం చేపడుతున్న చర్యలు, సాంకేతిక పురోగతి, సామాజిక సేవలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను విశదీకరించారు. పోర్టు సామాజిక బాధ్యతలో భాగంగా వినియోగిస్తున్న సీఎస్ఆర్ నిధులకు సంబంధించి విద్యా, ఆరోగ్య రంగాలకు చెందిన సంస్థలకు చెక్కులు అందించారు. శిక్షణను పూర్తిచేసుకున్న సిబ్బందికి ఐజీఓటీ సర్టిఫికెట్లు, పెన్షనర్లకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం పోర్టు పరిపాలనా భవనంలో ఆధునీకరించిన బోర్డు రూంను అంగముత్తు ప్రారంభించారు. దీనికి వైజాగ్‌పటంగా నామకరణం చేశారు. పోర్టు పరిసర ప్రాంతాలలో సుందరీకరణ, పచ్చదనాన్ని పెంపొందించే పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, చీఫ్ విజిలెన్స్ అధికారి పి.ఎస్.ఎల్. స్వామి, పోర్టు విభాగాధిపతులు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుదాం



వివిధ ఐటీ పరిశ్రమల ప్రతినిధులతో సీపీ శంఖబ్రత బాగ్చి

- ఐటీ పరిశ్రమల ప్రతినిధులతో సీపీ శంఖబ్రత బాగ్చి భేటీ

మధురవాడ : విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడం ద్వారా పలు పరిశ్రమలు రావడానికి అవకాశం ఉంటుందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చెప్పారు. శుక్రవారం మధురవాడలోని విశాఖ ఐటీ సెజ్‌లో సింబయాసిస్‌లో వివిధ ఐటీ పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింబయాసిస్ సీఈవో నరేష్ కుమార్ మాట్లాడుతూ ఐటీ సెజ్‌లో పోలీసు పెట్రోలింగ్ పెంచాలని, చాలా చోట్ల వీధిలైట్లు వెలగడం లేదని, సీసీ కెమెరాలు లేవన్నారు. పైగా ఇండియాలో టాప్ 10 (సీతా)సిటీస్ జాబితాలో విశాఖ లేక పోవడం పెద్ద లోటుగా ఉందన్నారు. ఇటువంటివి విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయన్నారు. గంజాయి మత్తులో కొందరు నగరంలో 82 చోట్ల వీధిలైట్లు ధ్వంసం చేసినట్టు జీవీఎంసీ అధికారులు గుర్తించారన్నారు. మౌర్యటెక్ ప్రతినిధి అరవింద్ మాట్లాడుతూ అస్తవ్యస్తమైన ట్రాఫిక్, ట్రాన్స్‌పోర్ట్, సెక్యూరిటీ సక్రమంగా లేకపోవడంతో ఇతర పలు పారిశ్రామిక వేతలు ముందుకు రావడం లేదన్నారు. ఐటీ జంక్షన్‌కు సమీపంలో వైన్ షాపు ఉండడం మహిళా ఉద్యోగుల భద్రతకు ముప్పుగా ఉందని ఇన్ఫోసిస్ ప్రతినిధి చెప్పారు. తమ కంపెనీలో సిబ్బంది డ్యూటీ రాత్రి 11.15కి పూర్తవుతుందని, సరైన ట్రాన్స్‌పోర్ట్, రక్షణ లేక గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు మెడ్ టెక్ ప్రతినిధి చెప్పారు. వీటిపై సీపీ శంఖబ్రత బాగ్చి స్పందిస్తూ రిక్రూట్‌మెంట్ లేక సిబ్బంది కొరత, పెట్రోలింగ్ వాహనాలు పూర్తి స్థాయిలో లేకపోవడం వంటి సమస్యలున్నాయన్నారు. వీధిలైట్లు ఏర్పాటైతే భయం పోతుందన్నారు. సిటీ ఇమేజ్ దెబ్బతికుండా జాగ్రత్త వహించాలన్నారు. తన నంబరు అందరికీ ఇచ్చానని, రాత్రి 2, 3 గంటలు అయినా ఫోన్ ఆన్సర్ చేస్తున్నానన్నారు. ఐటీ జంక్షన్‌లో పెన్నంట్ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన ఐటీ పార్కు పోలీస్ ఔట్ పోస్ట్‌ను సీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీపీ అజిత్ వేజెండ్ల, ఏసీపీ అప్పలరాజు, సీఐ బాలకృష్ణ, జెడ్సీ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌సీ కాదు.. టీడీపీ అభివృద్ధి సమీక్ష

- ప్రతిపక్ష ఎమ్మెల్సీ, ఎంపీలను ఆహ్వానించని వైనం
- కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలతోనే చర్చలు
- మండలిలో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న ఎమ్మెల్సీలు
- పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన ఇన్‌చార్జ్ మంత్రి స్వామి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వీరాంజనేయ స్వామి, ఎంపీ భరత్, అధికారులు

సాక్షి, విశాఖపట్నం : జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం అంటే.. రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలి. అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఆహ్వానం అందించాలి. కానీ ప్రోటోకాల్‌ను అధికారులు తుంగలో తొక్కారు. ప్రతిపక్ష ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులను కనీసం ఆహ్వానించకుండా డీఆర్‌సీ నిర్వహించేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలా కనిపించలేదు. అచ్చంగా కూటమి నేతల రాజకీయ అభివృద్ధి సమావేశంలా మార్చేశారు. ప్రతిపక్ష ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు వస్తే తమ ప్రభుత్వ పాలన లోపాల్ని నిలదీసి ప్రజల ముందు పరువు తీస్తారేమోనన్న భయంతో స్థానిక నేతలు వైఎస్సార్‌సీపీ ప్రతినిధులకు ఆహ్వానం ఇవ్వకూడదంటూ అధికారులకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. మొత్తంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా నిర్వహించిన డీఆర్‌సీ సమావేశాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్స్‌తో మమ అనిపించేశారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల స్థితిగతులు, వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్ తదితర అంశాలపై చర్చించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోల బాల శ్రీ వీరాంజనేయ స్వామి అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో పలు అంశాలపై అధికారులతో కలిసి సమీక్షించారు. విశాఖ మహానగరం ఖ్యాతిని మరింత పెంచేలా అభివద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి విశాఖ నగరం నుంచి 45 నిమిషాల్లో చేరుకునేలా రోడ్లను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఆదేవిధంగా లంకెలపాలెం నుంచి భోగాపురం చేరుకునే వరకు 12 కూడళ్లు ఇబ్బంది కరంగా ఉన్నాయని అక్కడ ఫ్లైఓవర్లు వేయాలని స్థానిక ఎమ్మెల్యేలు కోరారు. ప్రస్తుతం ఉన్న జాతీయ హైవే-16ను విస్తరించటం లేదా బీచ్ సమీపంలో రోడ్డును ఎయిర్ పోర్టుకు అనుసంధానం చేయడంపై సుదీర్ఘంగా చర్చించారు. దీనిపై జీఎంఆర్ గ్రూప్ ప్రతినిధులు పీపీటీ ద్వారా వివరించారు. మహా విశాఖ నగర మాస్టర్‌ప్లాన్‌పై వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులకు వివరించారు. నగరంలో కాలుష్య నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని డీఆర్‌సీలో నిర్ణయించారు. పంచగ్రామాల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. ఫీజుల విషయంలో విద్యార్థులను విద్యా సంస్థల నిర్వాహకులు ఇబ్బంది పెట్టకుండా చూడాలని, సర్టిఫికెట్లను వారి వద్ద ఉంచుకోవడం చట్ట విరుద్ధమని, దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టిసారించాలని ఆదేశించారు. అనంతరం వయోవృద్ధులు, తల్లిదండ్రులు పోషణ, సంక్షేమం చట్టం 2007 గురించి అవగాహన కార్యక్రమంలో భాగంగా ఇన్‌చార్జి మంత్రి డోల బాల వీరాంజనేయులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీపీ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీఆర్‌వో కె. మోహన్ కుమార్, ఆర్డీవోలు పి. శ్రీలేఖ, సంగీత్ మాథుర్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిల్‌లో ఫిర్యాదు చేస్తాం : వరుదు కల్యాణి

జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశానికి ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రతినిధుల్ని ఆహ్వానించకపోవడంపై ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశానికి వైఎస్సార్‌సీపీకి చెందిన ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులకు ఆహ్వానం పంపించలేదు. దీనిపై ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సిన డీఆర్‌సీకి అధికారులు ఎలాంటి ఆహ్వానం పంపించలేదన్నారు. అధికారులకు ప్రొటోకాల్ తెలీదా అని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రొటోకాల్ పాటించని అధికారులపై శాసనమండలిలో ఫిర్యాదు చేస్తామన్నారు.

రేషన్ సరకులు దారి మళ్లిస్తే క్రిమినల్ చర్యలు



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: రేషన్ దుకాణాల్లో, ఎం.ఎల్.ఎస్.(నిల్వ కేంద్రాలు) పాయింట్లలో విస్తృత తనిఖీలు చేపట్టాలని, అవకతవకలకు పాల్పడిన వారిపై 6ఏ కేసులు నమోదు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులను, తనిఖీ సిబ్బందిని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు, తనిఖీ సిబ్బందితో జేసీ సమావేశమయ్యారు.

రేషన్ సరుకుల పంపిణీ, దుకాణాల నిర్వహణ, ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ అందజేత, తనిఖీలు, కేసుల నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. రేషన్ సరుకులు దుర్వినియోగం కాకుండా చూడాలని, దారి మళ్లించే వారిపై నిఘా ఉంచాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో బినామీల పేర్లపై కొంతమంది దుకాణాలు నిర్వహిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, రేషన్ సరుకులు కూడా సమీపంలో ఉన్న హోల్ సేల్ దుకాణాలకు తరలిపోతున్నట్లు పలు పత్రికల్లో కథనాలు వస్తున్నాయని, ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. హోల్ సేల్ దుకాణాలపై బృందాలుగా వెళ్లి దాడులు చేయాలని సూచించారు. రాత్రి పూట కూడా తనిఖీలు చేపట్టాలని, ఎక్కడైనా తప్పు జరిగినట్లు గుర్తిస్తే క్రిమినల్ కేసులు పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రబ్బర్ స్టాంపుల వినియోగంలో కూడా అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని దీనిపై కూడా దృష్టి సారించాలన్నారు.

సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ డీఎం శ్రీలత, జిల్లా సహాయక పౌర సరఫరాల అధికారి కల్యాణి, ఏఎస్‌వోలు, తనిఖీ అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్ దరఖాస్తుకు గడువు పెంపు

విశాఖ విద్య: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆదివారం వరకు గడువు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కే రామారావు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో సకాలంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉచితంగా కోచింగ్ ఇవ్వడంతో పాటు, స్టైఫండ్ కూడా పొందే అవకాశం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏయూలో డ్యూయల్ డిగ్రీ కోర్సులు

- బీటెక్ వీఎల్ఎస్ఐ, ఎం.టెక్‌లో సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సులు



వార్షిక బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశంలో వీసీ ఆచార్య శశిభూషణరావు

మద్దిలపాలెం: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో డ్యూయల్ డిగ్రీ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు వీసీ ఆచార్య జి. శశిభూషణ రావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన వార్షిక బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా డ్యుయల్ డిగ్రీ కోర్సులను ప్రతిపాదించామన్నారు. బీటెక్ వీఎల్ఎస్ఐ, ఎంటెక్ సిగ్నల్ ప్రాసెసింగ్ కోర్సులను ప్రారంభిస్తామన్నారు. 2018 నుంచి ఏయూలో చదివి అనివార్య కారణాల వలన మిడ్, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాలేని, పరీక్ష తప్పిన విద్యార్థుల కోసం రీ ఎగ్జామినేషన్స్ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. సమాజ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. అనంతరం విభాగాలలో బీఓఎస్ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్. కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ. ఎన్ ధనుంజయ రావు, అకడమిక్ డీన్ ఆచార్య కె. ఈశ్వర్ కుమార్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహా రావు, జి.గిరిజా శంకర్, కె.సీతా మాణిక్యం, ఆచార్య ఆర్.పద్మశ్రీ, ఆచార్య డి.నాగరాజ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ వాణిజ్య సముదాయాలకు బహిరంగ వేలం

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏకు చెందిన వాణిజ్య సముదాయాలు, షాపులు, ఆడిటోరియాలు, ఆఫీసులు, ఖాళీ స్థలాలకు నెల, సంవత్సర అద్దె ప్రాతిపదికన మూడేళ్లకు లీజుకు ఇచ్చేందుకు టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కార్యదర్శి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. విస్తీర్ణం, అద్దె, వీఎంఆర్‌డీఏ అప్‌సెట్ ధర వంటి పూర్తి వివరాలు www.vmrda.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్ లేదా సంస్థ కార్యాలయం 8వ అంతస్తులో ఉన్న రెవెన్యూ విభాగంలో పొందవచ్చని సూచించారు. దరఖాస్తుతో పాటు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సిరిపురంలో దరఖాస్తు రుసుం రూ.2 వేలు చలానా రూపంలో చెల్లించి ఈఎండీ ఒకదానికి రూ.50 వేలు చలానా, డీడీలను ది మెట్రోపాలిటన్ కమిషనర్, వీఎంఆర్‌డీఏ, విశాఖపట్నం పేరు మీద తీసి నవంబర్ 8వ తేదీ సాయంత్రం 5 గంటలులోగా కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ కేటగిరీ వారైతే కుల, సంబంధిత ధ్రువపత్రం జతచేయాలన్నారు. నవంబర్ 11వ తేదీ ఉదయం 11 గంటలకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇంత నిర్లక్ష్యమా..?

- మార్కుల నమోదులో అలసత్వం
- ప్రైవేట్ స్కూళ్లలో ఇష్టారాజ్యం
- జిల్లా పురోగతిపై ఉన్నతాధికారుల సీరియస్




జిల్లా విద్యా శాఖ కార్యాలయం

విశాఖ విద్య: జిల్లా విద్యాశాఖ ఉదాసీనతతో ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు సొంత అజెండాతో ముందుకెళ్తున్నారు. ఫార్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్ష పూర్తయి నెల రోజులకు పైగానే కావొస్తున్నా.. వాటి మూల్యాంకనకు సంబంధించిన వివరాలను వెబ్సైట్లో నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ నుంచి శుక్రవారం విడుదల చేసిన గణాంకాలతో ఇది తేటతెల్లమైంది. జిల్లాలో 787 ప్రైవేటు పాఠశాలలు ఉండగా.. వీటిలో కేవలం 48 స్కూళ్ల నిర్వాహకులు మాత్రమే విద్యార్థులకు సంబంధించిన ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్ష మార్కుల నమోదు ప్రక్రియను పూర్తి చేశారు. పాఠశాలల సగటులో ఇది 6.1 శాతం మాత్రమే. ఇంకా 739 స్కూళ్లలో విద్యార్థుల మార్కులను నిరంతర సమగ్ర మూల్యాంకనం(సీసీఈ) వెబ్సైట్లో నమోదు చేయాల్సి ఉంది. అదే విధంగా జిల్లాలో 578 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిలో 235 స్కూళ్లు మాత్రమే సీసీఈలో మార్కులు నమోదు చేశారు. ఇంకా 343 పెండింగ్లో ఉన్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. 17 ఎయిడెడ్ స్కూళ్లకు గానూ మూడు చోట్ల మాత్రమే ఈ ప్రక్రియను పూర్తి చేశారు. నవంబర్ మొదటి వారంలో ఫార్మేటివ్ అసెస్మెంట్-2 సన్నద్ధమవుతున్నారు. విద్యార్థులను కూడా ఇందుకు సిద్ధం చేస్తున్నారు. కానీ ఫార్మేటివ్-1 పరీక్షకు సంబంధించిన మార్కులను వెబ్సైట్లో నమోదు చేయకపోవడంతో జిల్లాలో జరిగిన పరీక్షలు, మూల్యాంకనం ప్రక్రియలో పారదర్శకతపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. ప్రైవేట్ స్కూళ్లలో ఎస్సీఈఆర్టీ ద్వారా సరఫరా చేసిన ప్రశ్నాపత్రాలతో సవ్యంగా పరీక్ష నిర్వహించారా? అనే సందేహం వ్యక్తమవుతోంది. పరీక్షల నిర్వహణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ఉంది. దీనికి ప్రత్యేక అధికారులను సైతం డిప్యూటేషన్పై నియమించారు. కానీ డీసీఈబీ సిబ్బంది సవ్యంగా విధులు నిర్వర్తించకుండా.. డీఈవో కార్యాలయ అధికారులను ప్రసన్నం చేసుకునేందుకు ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో జిల్లాలోని కొన్ని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల వారు తమ సొంత సిలబస్లతోనే యూనిట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు డీఈవోగా బాధ్యతలు చేపడుతున్న ప్రేమ్కుమార్ ఇలాంటి వ్యవహారాలపై దృష్టి పెట్టాలని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

హిమాలయ పర్వత శ్రేణులు అత్యంత శీతల వాతావరణానికే కాదు.. ఎన్నో ప్రతికూలతలకు నిలయం. అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అలాంటి మంచు కొండలకు వెళ్లడం అంత సులభం కాదు. ప్రకృతి విసిరే సవాళ్లను తట్టుకొని నిలబడాలంటే మానసిక స్థైర్యంతో పాటు శారీరక దృఢత్వం కూడా ఎంతో అవసరం. అలాంటి పర్వత శ్రేణుల్లో ట్రెక్కింగ్ చేస్తూ తమ సాహసాన్ని చాటుకుంది అమెరికాకు చెందిన 10 మంది భారతీయ సంతతి వైద్యుల బృందం. ఇందులో మన విశాఖ వాసి ఉన్నారు. ఈ బృందం 5,364 మీటర్ల (17, 598 అడుగులు) ఎత్తులో ఉన్న మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్(ఈబీసీ) ట్రెక్కింగ్ను విజయవంతంగా పూర్తి చేసింది. – సీతమ్మధార

హిమాలయాల్లో సాహసం

- మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసిన విశాఖ వాసి
- అమెరికాకు చెందిన భారత సంతతి వైద్యులతో కలిసి ట్రెక్కింగ్
- యూఎస్ఏలో ఆంకాలజిస్ట్గా సేవలందిస్తున్న వినయ్కుమార్



ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వద్ద జాతీయ పతాకంతో డాక్టర్ వినయ్కుమార్



తల్లిదండ్రులు, సోదరుడితో డాక్టర్ వినయ్కుమార్

నక్కవానిపాలెం దరి కేఆర్ఎం కాలనీకి చెందిన డాక్టర్ వినయ్ కుమార్ అమెరికాలో ఆంకాలజిస్ట్. అమెరికాకు చెందిన 9 మంది భారతీయ సంతతి వైద్యుల బృందంతో కలిసి ఈ నెల 10వ తేదీన మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్కు బయలుదేరారు. ఈ ట్రిప్లో ప్రకృతి సోయగాలను వీక్షించడంతో పాటు అనేక అనుభూతులు పొందామని వినయ్కుమార్ తెలిపారు. మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ పూర్తి చేసుకున్న ఆయన గురువారం విశాఖ వచ్చారు. శనివారం అమెరికా వెళ్తున్న వినయ్కుమార్ శుక్రవారం 'సాక్షి'తో తన 'ఎవరెస్ట్' యాత్ర అనుభవాలను పంచుకున్నారు.

ఎన్నో అనుభూతుల సమ్మేళనం

'5,364 మీటర్ల ఎత్తులో ఉన్న ఎవరెస్ట్ బేస్ క్యాంప్ చేరుకోవడానికి కఠినమైన మార్గంలో పయనించాం. ప్రతి రోజూ నాలుగు నుంచి ఎనిమిది గంటల పాటు హైకింగ్ చేస్తూ.. దూద్ కోసి నది ఒడ్డున అనేక కిలోమీటర్ల పాటు ట్రెక్కింగ్ కొనసాగించాం. మధ్యలో ఎత్తైన కాలినడక వంతెనలు దాటుకుని.. సుందర దృశ్యాలను వీక్షిస్తూ ముందుకు సాగాం. ఈ క్రమంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నాం. ఈ యాత్రకు ముందు ఏడాది పాటు వివిధ ఎత్తుల్లో ఉన్న పర్వతాలపై శిక్షణ తీసుకున్నప్పటికీ.. ఈ ట్రెక్ మాత్రం ఊహించిన దాని కంటే చాలా సవాల్గా మారింది.' అని వినయ్కుమార్ వివరించారు.

ప్రకృతి అందాలకు ఫిదా

'ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ట్రెక్కింగ్ ప్రకృతి మార్గమే కాదు.. అక్కడి సంస్కృతిని తెలుసుకునేందుకు మాకు అవకాశం దక్కింది. అక్కడి ప్రజల జీవన విధానాలను ప్రత్యక్షంగా చూశాం. దారిలో అద్భుతమైన హిమాలయ పర్వత సుందర మనోహర దృశ్యాలను చూసి పరవశించిపోయాం. అలా సముద్ర మట్టానికి 3,440 మీటర్ల ఎత్తులో ఉన్న నామ్చే బజార్కు చేరుకున్నాం. ఈ ట్రెక్ ఎంతో శ్రమతో కూడినదే అయినా చుట్టూ ఉన్న అద్భుత సహజ సౌందర్యం, బృందంలోని సహచరుల పరస్పర సహకారంతో యాత్రను ఎంతో ఆనందదాయకంగా సాగించాం. ఆ తర్వాత 4,410 మీటర్ల ఎత్తులో ఉన్న తెంగ్బోచేకు చేరుకున్నాం. ఇక్కడ నుంచి పర్వత శిఖరాలు దగ్గరగా కనిపించాయి.' అని డాక్టర్ వినయ్ తెలిపారు.

శ్రమంతా మర్చిపోయాం..

ఉష్ణోగ్రతలు తగ్గి.. పైకి ఎక్కే కొద్దీ ట్రెక్ కష్టతరంగా మారింది. తలనొప్పి, తలతిరగడం ప్రారంభమైంది. అక్కడి టీ హౌస్లో సాధారణ మంచాలపై.. రొట్టె, పప్పుతో శాకాహార భోజనం చేసి నిద్రపోయాం. తర్వాత లోబుచెకు ఎక్కడం కఠినంగా మారింది. ఇది నిటారుగా.. దాదాపు 4,500 మీటర్ల ఎత్తులో ఉంది. నత్తల వేగంతో ఎక్కాం. ట్రెక్కింగ్లో మా ఆఖరి స్టాప్.. 5,164 మీటర్ల ఎత్తులో ఉన్న గొరెక్షెప్ గ్రామం. అక్కడ ఆక్సిజన్ స్థాయిలు 51 శాతం మాత్రమే ఉన్నాయి. దాదాపు 17,000 అడుగుల వద్ద ఆక్సిజన్ కోసం పెద్ద పోరాటమే చేశాం. చివరగా 10వ రోజున ఎవరెస్ట్ బేస్ క్యాంప్కు చేరుకోవడం గొప్పగా అనిపించింది. ఈ యాత్రలో మేం పడిన శ్రమ, భరించిన కష్టాలు.. అక్కడి ప్రకృతి అందాలను చూసి పొందిన అనుభూతుల్లో కొట్టుకుపోయాయనే చెప్పాలి. అద్భుతమైన హిమాలయ పర్వత దృశ్యాలు మా మనస్సుకు ఉత్తేజాన్ని ఇచ్చాయి. ఎన్నో అనుభూతులను మిగిల్చాయి. నా ఎవరెస్ట్ బేస్ క్యాంప్ విజయవంతం కావడంతో నా తల్లిదండ్రులు చాలా సంతోషించారు.' అని వినయ్కుమార్ ముగించారు. కాగా.. అతని తండ్రి రామచంద్రరావు ఏయూలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. తల్లి కమల ఏయూలో పీహెచ్డీ చేశారు. సోదరుడు వివేకానంద హైదరాబాద్లో జాబ్ చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం రాజపురం(వీరగున్నమ్మపురం)నకు చెందిన వీరు విశాఖపట్నంలో స్థిరపడ్డారు.

జలవనరుల శాఖ బదిలీల్లో సిత్రాలు

- విశాఖ ఎస్ఈకి విజయవాడ సీఈగా..
- కర్నూలు ఎస్ఈకి విశాఖ సీఈగా బాధ్యతలు

మహారాణిపేట: రాష్ట్ర జలవనరుల శాఖలో జరిగిన తాజా బదిలీల్లో గందరగోళం నెలకొంది. సూపరింటెండెంట్ ఇంజినీర్లను ఇన్చార్జి చీఫ్ ఇంజినీర్లుగా నియమించే ఉత్తర్వులతో అధికారులు ఇబ్బందులు ఎదురుకానున్నాయి. జలవనరుల శాఖ విశాఖ ఎస్ఈగా పనిచేస్తున్న శంబంగి సుగుణాకరరావును విజయవాడ చీఫ్ ఇంజినీర్గా, కర్నూలు ఎస్ఈగా పనిచేస్తున్న డి.రామ్గోపాల్ను విశాఖ నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజినీర్గా నియమించారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో సుగుణాకరరావు విశాఖ నుంచి విజయవాడకు సుమారు 399 కిలోమీటర్లు, రామ్గోపాల్ కర్నూల్ నుంచి విశాఖకు సుమారు 690 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ దూరాభారం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకుంది. ఇద్దరు గజిటెడ్ అధికారులు అక్కడ నుంచి ఇక్కడకు, ఇక్కడ నుంచి అక్కడకు ప్రయాణాలు చేస్తే.. ఇంకా ఉద్యోగ నిర్వహణ కష్టమవుతుంది. దూర ప్రయాణాల వల్ల కుటుంబ జీవితంపై కూడా ప్రభావం పడుతుంది. పని భారం పెరుగుతుంది. పైగా ప్రభుత్వ ఖర్చులతోనే వీరు ప్రయాణం చేస్తారు. ఈ ఖర్చులన్నీ తడిసిమోపిడయ్యే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఏ మాత్రం ఆలోచించకుండా తీసుకుంటున్న ఇలాంటి నిర్ణయాలతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

హైడ్రోజన్ ఇంధన సెల్ టెక్నాలజీ ప్రారంభం

సింథియా: దేశ సముద్ర భవిష్యత్ను శక్తివంతం చేసే దిశగా రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ కొరియన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ అసోసియేట్, లోటస్ వైర్లెస్ ప్రైవేట్ లిమిటెడ్తో కలిసి హిందూస్థాన్ షిప్యార్డ్ శుక్రవారం అత్యాధునిక హైడ్రోజన్ ఇంధన సెల్ టెక్నాలజీని ప్రారంభించింది. ఈ హైడ్రోజన్ ఇంధన యంత్రాలు 250 కిలోవాట్ నుంచి 2 మెగావాట్ వరకు శక్తిని ఉత్పత్తి చేస్తాయి. ఇవి పూర్తిగా క్లాస్-సర్టిఫైడ్. అలాగే వివిధ సముద్ర అనువర్తనాలకు సరిపోయేలా తయారు చేశారు. డీజిల్తో నడిచే వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా హైడ్రోజన్ ఇంధన సెల్ టెక్నాలజీని వాడడం ద్వారా విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని సంస్థ యాజమాన్యం తెలిపింది.

ప్రభుత్వ భూమిని ఆక్రమించారు.. అడ్డుకోండి..

- పల్లా శ్రీనివాస్తో ఉన్న ఫొటోలు పంపి బెదిరింపులు
- తప్పుడు కేసులు పెట్టి వేధింపులు
- బాధిత రైతు గొర్లి దేముడుబాబు ఆరోపణ



మాట్లాడుతున్న బాధితుడు గొర్లి దేముడుబాబు



పల్లాతో వెంకట రమణ, నాగలక్ష్మి దంపతులు (బాధితుడిని బెదిరిస్తూ పంపిన ఫొటో)

సబ్బవరం: పూర్వం నుంచి తమ సాగులో ఉన్న ప్రభుత్వ భూమిని పాతరపల్లి వెంకట రమణ, నాగలక్ష్మి దంపతులు ఆక్రమించడమే కాకుండా కూటమి నేతల అండతో తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరిపాక శివారు లగిశెట్టిపాలేనికి చెందిన రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. తమకు న్యాయం చేసి.. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు ఆక్రమణదారుల వైపే కొమ్ముకాస్తున్నారని ఆరోపించింది. బాధిత గొర్లి దేముడు కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఈ వివాదాస్పద స్థలం వద్ద శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.
మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 91లో సుమారు 8.74 ఎకరాలు.. ప్రభుత్వ బంజర భూమి(గయాలు)గా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. ఈ భూమిని అనుకుని.. ప్రభుత్వం డీ పట్టా ఇచ్చిన రెండు ఎకరాల్లో గొర్లి దేముడు బాబు, గొర్లి నాగరాజు కుటుంబ సభ్యులు జీడితోట సాగు చేస్తున్నారు. దీని పక్కనే ఉన్న సర్వే నంబర్ 91లోని మరో రెండు ఎకరాల భూమిలో పూర్వీకుల నుంచి జీడితోట సాగు చేసుకుంటూ మొత్తం భూమిలో ఫలసాయం పొందుతున్నారు. ఇదే సర్వే నంబర్లో మరో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కంచరపాలేనికి చెందిన పాతరపల్లి వెంకటరమణ, నాగలక్ష్మి దంపతులు వేరొకరి వద్ద కొనుగోలు చేసినట్లు గొర్లి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో తమ సాగులో ఉన్న రెండు ఎకరాల భూమి(గయాలు)ని ఆక్రమించి జీడితోటను తొలగించారని ఆరోపించారు. ఆ భూమిలో మామిడి మొక్కలు నాటి తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమించిన ఈ భూమి కోర్టు వివాదంలో ఉందని, ఈ భూమిలోకి ఎవరైనా వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులు కూడా ఉన్నాయని తెలిపారు. దీనిపై స్థానిక తహసీల్దార్కు ఫిర్యాదు చేస్తే.. ఆ బోర్డులను తీయించేశారని ఆరోపించారు. దీంతో ఆక్రమణదారులు.. తెలుగుదేశం అధ్యక్షుడే తమ వెంట ఉన్నారంటూ బెదిరింపులకు పాల్పడి.. ఆయనతో తీసుకున్న ఫొటోలను వాట్సాప్లో పంపిస్తున్నారని దేముడుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తూ.. తనపై పోలీస్ స్టేషన్లో తప్పుడు కేసులు పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణను వివరణ కోరగా లగిశెట్టిపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 91లో 8.74 ఎకరాలు.. ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉందన్నారు. వివాదస్పదమైన భూమిపై ఫిర్యాదు చేయడంతో బోర్డును తొలగించామన్నారు. ఈ భూమిలో మామిడి మొక్కలు నాటినట్లు తమ దృష్టికి వచ్చిందని, స్వయంగా పరిశీలించి వారి దగ్గర ఉన్న ఆధారాలు సేకరిస్తామన్నారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సమావేశానికి పిలిచి.. అవమానిస్తారా?

- కనీస గౌరవం ఇవ్వకపోవడంతో బయటకు వెళ్లిపోయిన మహిళా నేతలు
- టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆగ్రహం

మహారాణిపేట : తెలుగుదేశం మహిళా నేతలను ఆ పార్టీ నేతలే అవమానించారు. టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలికి కనీస గౌరవం ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం నగర కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా శ్రీబాలా వీరాంజనేయ స్వామి సమక్షంలో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీజేపీ, జనసేన నేతలను వేదికపైకి ఆహ్వానించారు. కానీ టీడీపీ మహిళా నేతలెవ్వరినీ గుర్తించలేదు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు అనంతలక్ష్మిని సైతం పక్కనపెట్టేశారు. దీంతో సభ నిర్వాహకులు, నాయకులపై మహిళా నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సమావేశానికి పిలిచి అవమానించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతలక్ష్మితో పాటు మహిళా నేతలు, కార్యకర్తలు సమావేశాన్ని బహిష్కరించి అక్కడి నుంచి బయటకు వచ్చేశారు. ఈ విషయాన్ని గమనించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు జోక్యం చేసుకోవడంతో వారు శాంతించారు.

రెప్కో బ్యాంకుకు అవార్డులు



అవార్డులను అందుకుంటున్న బ్యాంకు ప్రతినిధులు

విశాఖ విద్య: ఫ్రాంటియర్స్ ఇన్ కో–ఆపరేటివ్ బ్యాంకింగ్ అవార్డ్స్లో రిస్క్ మేనేజ్మెంట్, కేవైసీ పరిశీలనలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు రెప్కో బ్యాంకు రెండు అవార్డులను గెలుచుకుంది. ఇటీవల జరిగిన నేషనల్ కో–ఆపరేటివ్ బ్యాంకింగ్ సమ్మిట్లో రెప్కో బ్యాంకు చైర్మన్ సంతానం, హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ చైర్మన్ తంగరాజు, నిర్వాహక డైరెక్టర్ గోకుల ఈ అవార్డులను అందుకున్నారు. 1969లో ప్రారంభమైన బ్యాంకు 108 శాఖలతో కార్యకలాపాలు నిర్వహిస్తోందని బ్యాంక్ చైర్మన్ సంతానం తెలిపారు. రూ. 20,500 కోట్ల వ్యాపారం చేరుకుందని, బ్యాంకు ద్వారా వచ్చే లాభంలో 25 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లిస్తున్నట్లు చెప్పారు. సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీ ఇస్తున్నట్లు వెల్లడించారు. అన్ని వర్గాల వారికి సంతృప్తికరమైన రుణ పథకాలు వర్తింపజేస్తూ బ్యాంకు పురోభివృద్ధిలో పయనిస్తోందని వివరించారు.

నేడు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ ఎస్సీ, ఎస్టీ ఎంటర్ప్రెన్యూర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంటర్ప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ ప్రొగ్రాం(ఈపీడీ) నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. వాసీవా భవనంలో శనివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

కేజీహెచ్కు పోర్టు విరాళం రూ.కోటి



పోర్టు చైర్మన్ అంగముత్తు నుంచి చెక్కు అందుకుంటున్న సూపరింటెండెంట్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్ అభివృద్ధికి విశాఖ పట్నం పోర్టు ట్రస్టు బాసటగా నిలిచింది. కేజీహెచ్లో రోగులకు ఉపయోగకరంగా ఉండే క్యాజువాలిటీ, అవుట్ పేషెంట్(ఓపీ) విభాగం నిర్మాణం కోసం సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.కోటి మంజూరు చేసింది. శుక్రవారం పోర్టు ట్రస్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు ఈ చెక్కును కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్కు అందించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్కు, పోర్టు చైర్మన్కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ చొరవ వల్లే ఈ నిధులు కేజీహెచ్కు వచ్చాయని పేర్కొన్నారు.

మందుబాబులకు జైలు, జరిమానా

అల్లిపురం: మందుబాబులకు 10 నుంచి 15 రోజులు జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని ఫోర్త్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. హార్బర్ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు పర్యవేక్షణలో జ్ఞానాపురం జంక్షన్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్లో 18 మంది వాహనచోదకులు పట్టుబడ్డారు. వీరిని శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టారు. మేజిస్ట్రేట్ సి.నారాయణమూర్తి ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ ఎస్.రవిశంకర్ పట్నాయక్, లారీ డ్రైవర్ మైలాల సాహులకు 15 రోజుల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించారు. ఆటో డ్రైవర్ పితాన కాశీకి 10 రోజుల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా, మిగిలిన వారికి రూ.10 వేలు చొప్పున రూ.1,50,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

'తుపాను' ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: తుపాను కారణంగా రైళ్ల రద్దు కావడంతో.. ఎక్కడికక్కడ నిలిచిపోయిన ప్రయాణికుల సౌకర్యార్థం వన్వే స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–సంత్రగచ్చి (02808) వన్వే ఏసీ స్పెషల్ ఎక్స్ప్రెస్ శనివారం ఉదయం 8.10 గంటలకు చెన్నైలో బయలుదేరి.. రాత్రి 8.13 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.15 గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 11.05 గంటలకు సంత్రగచ్చి వెళ్తుంది. ◆ ఎస్ఎంవీ బెంగళూరు–హౌరా(06288) వన్వే ఏసీ స్పెషల్ ఎక్స్ప్రెస్ శనివారం రాత్రి 9.15 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 5.13 గంటలకు కొత్తవలస చేరుకుంటుంది. అక్కడ నుంచి 5.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు హౌరా వెళ్తుంది.

నేడు గుణుపూర్– పూరి ఎక్స్ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: దానా తుపాను కారణంగా శనివారం గుణుపూర్–పూరి(18418) ఎక్స్ప్రెస్ను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. శనివారం హౌరా–ఎస్ఎంవీటీ బెంగళూరు(12245) దురంతో ఎక్స్ప్రెస్, షాలిమర్–హైదరాబాద్(18045)ఈస్ట్కోస్ట్ ఎక్స్ప్రెస్, హౌరా–తిరుపతి(20889)హమ్సఫర్ ఎక్స్ప్రెస్, షాలిమర్–తిరునల్వేలి(06088) స్పెషల్ ఎక్స్ప్రెస్లను రద్దు చేశారు. కాగా.. శుక్రవారం సంత్రగచ్చి–తాంబరం(06096) స్పెషల్ ఎక్స్ప్రెస్ను రద్దు చేశారు.

ప్రసాద్ పథకం పనులు వేగవంతం

- రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ



ప్రసాద్ పథకం పనులపై సమీక్ష నిర్వహిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న ప్రసాద్ పథకం పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అధికారులకు సూచించారు. ఈ పనులను శుక్రవారం ఆయన పరిశీలించి.. సింహగిరిపై కాటేజీలో ఈవో వి.త్రినాథరావు, టూరిజం శాఖ, దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రూ.54 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో సింహాచలం దేవస్థానంలో అభివృద్ధి పనులు పనులను వేగవంతంగా చేయాలని టూరిజం శాఖ అధికారులను ఆదేశించారు. సింహగిరిపై నిర్మించే క్యూకాంప్లెక్స్పై మరో రెండు అంతస్తులు అదనంగా దేవస్థానం నిర్మించేందుకు ప్రణాళిక వేస్తున్నట్లు చెప్పారు. కొండదిగువ పుష్కరిణి సత్రం బిల్డింగ్పై కూడా అదనంగా అంతస్తుల నిర్మాణానికి సంబంధించి కూడా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. యాంపీ థియేటర్, యాగశాల నిర్మాణాల విషయంపై చర్చించారు. టూరిజం శాఖ ఈఈ రమణ, ఏఈ మదన్మోహన్, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

అనంతుడి ఆలయ శిఖర పనుల పరిశీలన

పద్మనాభం: అనంత పద్మనాభ స్వామి ఆలయ శిఖర పునర్నిర్మాణ పనులను వచ్చే నెల 20 లోగా పూర్తి చేయాలని కమిషనర్ ఆర్.సత్యనారాయణ కాంట్రాక్టర్ను ఆదేశించారు. గిరిపై జరుగుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. వచ్చే నెల 30న అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం నిర్వహించనున్నందున.. ముందుగా శిఖరం పనులను పూర్తి చేయాలన్నారు. ఆలయానికి ఎంత భూమి ఉంది, ఎంత భూమికి శిస్తులు వసూలు అవుతున్నాయని ఈవో నానాజీ బాబును అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ రాజ్ నిధులు రూ.5 కోట్లతో చేపడుతున్న ఘాట్ రోడ్డు అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు.